ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..




'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | గురువారం | 09.07.2026 | సంపుటి : 2 | సంచిక : 08 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్


## తాడిచెర్ల-2 కేటాయింపులపై
# తప్పుడు ప్రకటన

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పుదోవ పట్టించే యత్నం

**2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు**

**మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు.



హైదరాబాద్, జూలై 8 : తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో

-మిగతా 2 లో..



## యూట్యూబ్ చూసి వైన్ తయారీ

- స్వయం ఉపాధికి వృద్ధుడి అక్రమ మార్గం
- ఏడాదిగా ఇంట్లోనే వైన్ తయారీతో ధనార్జన
- దాడిచేసి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

03



02

### 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలపై మంత్రి సురేఖ సమీక్ష



## సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా బృందం భేటీ

### తెలంగాణలో పెట్టుబడులపై ఆసక్తి

**కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు.**

హైదరాబాద్, జూలై 8 : తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా

-మిగతా 2 లో..

### గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

ఖమ్మం జిల్లాలో ఏర్పాటుపై సిఎంతో చర్చలు

రేవంత్‌తో భేటీ అయిన గోద్రెజ్ ప్రతినిధులు

02

## ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై
# కట్టుకథలు

**నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతుంటే చోద్యమా**

**గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

ఒకపక్క నీళ్లు లేక పల్లెల్లో రైతన్నల కన్నీళ్లు పెట్టుకుంటుంటే.. మరోపక్క మేడిగడ్డ కాడ లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా కిందకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంలో నీరో చక్రవర్తిని మించిపోయి సర్కారు తమాషా చూస్తున్నదని మండిపడ్డారు.



హైదరాబాద్, జూలై 8 : కేసీఆర్ మీద కక్షతో రైతన్నలకు శిక్ష వేయడం తగునా అని నిలదీశారు. ఎల్‌నినో పడగ విప్పుతుంటే..ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ కూర్చుంటారా? ఇంకెన్నాళ్లు కాళేశ్వరం మీద దుష్ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తారు? ముఖ్యమంత్రికి రైతు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? అని మండిపడ్డారు.

-మిగతా 2 లో..



### ఎన్నికలు ఎప్పుడైనా
# వార్ వన్ సైడే

**ఇప్పటికే బిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ది చెప్పారు**

**పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోంది**

**జూరాల, నెట్టంపాడు ముంపు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు**

**జోగులాంబ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

జోగులాంబ గద్వాల, జూలై 8 : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికల వచ్చినా వార్ వన్ సైడేనని మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు. జోగులాంబ

-మిగతా 2 లో..

## ధాన్యం కొనుగోళ్లలో
# కేంద్రంపై దుష్ప్రచారం

**సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి**

**బిజెపి నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ**

న్యూఢిల్లీ, జూలై 8 : ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు. బుధవారం కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీలో కలిశారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్రమంత్రికి బీజేపీ నేతలు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తెలంగాణ బీజేపీ

-మిగతా 2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## ఏ తప్పూ చేయలేదు..
# వివరణ ఎందుకిస్తా?

**దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా**

**నా అధికారలేంటో నాకు తెలియదా**

**కొండా సురేఖకు కడియం కౌంటర్**

జనగామ, జూలై 8 : తెలంగాణ మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. తనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌కు ఆమె లేఖ రాసిన నేపథ్యంలో కడియం స్పందించారు. "కొందరు కొత్త అలవాట్లు నేర్చుకుంటున్నారు. కాంట్రవర్సీ చేస్తూ ప్రజల మధ్య ఉండాలనుకుంటున్నారు. నేను ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకు ఇస్తా? దేవాదాయ శాఖ అధికారులతో నేను సమీక్ష నిర్వహించలేదు.. సమస్యలు

-మిగతా 2 లో..





### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా
# అభివృద్ధిలో ముందడుగు

**రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన**

**నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం**

**ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

03

## చంద్రబాబు కోసమే
# గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

**చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు**

**దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా**

**తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు**

**క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు**

**మీడియా సమావేశంలో ఫైర్ అయిన మాజీమంత్రి హరీష్ రావు**

హైదరాబాద్, జూలై 8 : గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా

-మిగతా 2 లో..



# తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ఫైళ్లను పెండింగ్‌లో



పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్-3 ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్-3 తో పాటు సత్తుపల్లి బ్లాక్-3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయ కుండా నష్టం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులను, అలాగే తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు.



## సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా బృందం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్, మహేశ్ కొండూరు అమిత్ మెహ్రా ,దిలెక్ , థామస్ ఫ్రోలిక్, సెంథిల్ తొండమాన్, సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

## గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

- ఖమ్మం జిల్లాలో ఏర్పాటుపై సిఎంతో చర్చలు
- రేవంత్‌తో భేటీ అయిన గోద్రెజ్ ప్రతినిధులు

**హైదరాబాద్,జూలై8 :** తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. కమ్మం జిల్లాలో ఏర్పాటు కానున్న దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రెజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గా÷-డ్గ÷న్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గా÷-డ్గ÷న్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై కట్టుకథలు

(మొదటిపేజీ తరువాయి)

మీ పగలు.. ప్రతీకారాలు ప్రతిపక్షం మీద తీర్చుకోండి, అన్నంపెట్టే రైతును మాత్రం ఆగం చేయకండి అని హితవు పలికారు. కాళేశ్వరంలో నిండుగా నీళ్లు పారుతున్నా మీ పొలాలను ఎండబెతున్న కాంగ్రెస్ కర్కశ పాలన తీరును ప్రశ్నించండి అని తెలంగాణ రైతన్నలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎక్కడా చుక్కనీళ్లు లేని కాలంలోనూ.. కాళేశ్వరమే ప్రాణెళిశ్వరమై కాపాడుతుందని అర్థం చేసుకోవాలన్నారు.వానల్లేక.. ఎవుసం జరగక అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించడం లేదా? కాళేశ్వరం దగ్గర పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి..గోస తీర్చాలన్న సోయి కలగట్లేదా? అని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. లోటు వర్షపాతంతో నాట్లు పడట్లేదు.. విత్తనాలు వేయట్లేదు.. పంటలు సాగుచేసే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వమేమో ఏమీ పట్టించుకోకుండా దున్నపోతు మీద వానపడ్డట్టే వ్యవహరిస్తున్నదని తెలిపారు. కన్నెపల్లి పంప్ హౌజ్ మోటర్లను నడిపించి.. కరువు రాకుండా కాపాడు కోవాలన్న బుద్ధి ఎందుకు లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకిస్తా?

(మొదటిపేజీ తరువాయి)

విన్నవించా. నా వద్దకు అధికారులను పిలిస్తే అది సమీక్ష అవుతుంది. దేవాదాయశాఖపై సమీక్ష చేసే హక్కు లేదని నాకూ తెలుసు. ఆలయాల సమస్య పరిష్కారానికి ఆ శాఖ కమిషనర్‌ను కలిశా. నా నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి కోసం చర్చించా. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే సీఎంనూ కలుస్తా" అని కడియం శ్రీహరి అన్నారు. తనకు తెలియకుండా దేవాదాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారని మంత్రి కొండా సురేఖ మంగళ వారం ఆరోపించారు. ఇది పరిపాలనా నిబంధనల (రూల్స్ ఆఫ్ బిజినెస్)ను ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు. కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరి స్పందించారు.



## ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే

(మొదటిపేజీ తరువాయి)

గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడులో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసు కున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నాం ఇందిరమ్మ ఇండ్లు. దశాబ్దాల పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వంలో సాకారం చేస్తోంది. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూ నిర్వాసితులకు కూడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం. రెవెన్యూ శాఖ పరిధిలోని గద్వాల జిల్లా కావాల్సిన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం.పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ప్రజాప్రభుత్వం అని మంత్రి తెలిపారు.

## చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు. సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు.మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

## ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

కిసాన్ మోర్చా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తాము చేపట్టిన రైతుగోస ఉద్యమం తర్వాత ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ వేగవంతం చేసి ఈఅఎకి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌లో సరైన విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2024-25లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరిస్తే ఈరోజు వరకు 13 నుంచి 14 శాతం బియ్యం కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. 2024-26 ఖరీఫ్ సీజన్‌లోని బియ్యం ఇంకా ఈఅఎకి చేరలేదని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదేవిధంగా వ్యవహారిం చారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ఔఅఆఅ ద్వారా రాష్ట్రాలకు కేంద్రం రుణాలు ఇస్తోందని వివరించారు. 2024-26లో రూ.37 వేల కోట్లు రాష్ట్రానికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు. 2026-27లో కూడా సుమారు రూ.23 వేల కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ధర్నా చేయాలని.. వాస్తవాలు చెబుతామని అన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం ఉత్పత్తి స్థాయికి తగ్గట్లుగా మౌలిక వసతులు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యంలో 70 శాతం నిధులను కూడా కేంద్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం పండించిన పంట సేకరణ విషయంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము చేపట్టిన రైతు గోస ద్వారా రైతుల ఆందోళనను స్వయంగా చూశామని తెలిపారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేశామని అన్నారు. అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినందకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2013-14లో అప్పటి యూపీఏ- 2లో కాంగ్రెస్ ప్రభుత్వం 24.32 లక్షల మెట్రిక్ టన్నులనూ మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసిందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో కేంద్రప్రభుత్వం 146.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కొన్నదానికంటే 6 రెట్లు ఎక్కువగా మోదీ హయాంలో కొనుగోలు చేశామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వరికి రూ.2369 ఓ౼ూఖ చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో వరికి రూ.1300 ఓ౼ూఖ ఇచ్చిందని తెలిపారు. వడ్ల కొనుగోలుకు రూ.34891 కోట్లని తెలంగాణలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు, రైతుల పక్షాన తాము నిలబడతామని మాటిచ్చారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్రం చేస్తే మర ఆడించి బియ్యం పంపడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఎందుకు పడుతోందని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

## గురుకుల విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై అప్రమత్తం

- వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- పారదర్శక అడ్మిషన్ల పక్రియ నిర్వహించాలి
- నాణ్యమైన బోధనకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, జూలై 8 :** తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... గురుకులాల్లో ప్రవేశాల పక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నీటి నాణ్యతను పరీక్షించి, అవసరమైన చోట వాటర్ ప్యూర్గి÷యెర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని మంత్రి పేర్కొన్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, డిస్పోజల్ యూనిట్లు, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి గురుకులంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు నిరంతర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే చికిత్సకు పంపే విధంగా ఆరోగ్య ప్రోటోకాల్ అమలు చేయాలని సూచించారు. వంటశాలలు, డైనింగ్ హాళ్లు, నిల్వ గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. నాణ్యమైన కూరగాయలు, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల సరఫరా నిరంతరంగా జరిగేలా పర్యవేక్షించాలని, నిల్వ ఆహార పదార్థాల నాణ్యతను తరచుగా తనిఖీ చేయాలని చెప్పారు. విద్యార్థులకు పౌష్టికాహారం, సురక్షితమైన వసతి, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను దశలవారీగా విస్తరించేందుకు ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, ఉన్నత విద్యా అవకాశాలు మరింత చేరువయ్యేలా సీఓఈల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల వేతనాలు ప్రతి నెలా ఒకటో తేదీన జమయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వేతనాల విడుదలలో జాప్యం లేకుండా ఆర్థిక, పరిపాలనా పక్రియలను ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సంతోష్ ,తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంస్థ కార్యదర్శికంభంపాటి శారద, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి నటరాజ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

**అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలపై మంత్రి సురేఖ సమీక్ష**

**హైదరాబాద్, జూలై 8 :** నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జులై 20 నుంచి 22 వరకు ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. జులై 20 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.బల్కంపేట ఎల్లమ్మ దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమని భక్తుల విశ్వాసం అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జులై 21న వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. జులై 22న సాయంత్రం ఘనంగా రథోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సేవలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు సురేఖ. పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌లతోపాటు అత్యవసర వైద్య బృందాలనూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

- రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన
- నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం
- ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**నాగర్‌కర్నూల్, జూలై 8 :** రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోం దన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ÷రిలిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



## రేవంత్‌తో మలేషియా ఎంపి శరవణన్ భేటీ

**హైదరాబాద్, జూలై 8 :** ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మలేషియా పార్లమెంటు సభ్యుడు డా. ఎం.శరవణన్. మర్యాదపూర్వకంగా కలిసారు. గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 లో పాల్గొనడానికి హైదరాబాద్ కు వచ్చిన శరవణన్ సిఎంతో భేటీ అయ్యారు. సీఎంని కలిసిన వారిలో గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 పాల్గొన్న మరికొందరు అంతర్జాతీయ ప్రతినిధులు ఉన్నారు..పర్యావరణ, సామాజిక, పరిపాలన పరమైన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగంతో పాటు భవిష్యత్తు పెట్టుబడులపైన ముఖ్యమంత్రి, శరవణన్, అంతర్జాతీయ ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. మావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

### ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు



**న్యూఢిల్లీ, జూలై 8 :** నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్ (హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

## నేడు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి జేపీ నడ్డా

### ఎయిమ్స్‌పై సమీక్షించనున్న మంత్రి

**హైదరాబాద్, జూలై 8 :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం తెలంగాణలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గురువారం ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీన గర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయ ల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించ నున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

## యూరియా లభ్యతను మరింత సరళతరం

### మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్

### యాప్ లో బుకింగ్ చేసుకోలేనివారికి సులువైన మార్గం



**హైదరాబాద్, జూలై 8 :** రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది. రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్‌తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను నమోదు చేస్తారు. రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు. రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపిని ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి జారీ చేయబడుతుంది. మీ సేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడి బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. బుకింగ్ గడువు ముగిసే లోపు రైతులు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి. సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ఓటిపి అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి. కేవలం పదిరూపాయల నామమాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఏవైనా సందేహాలు లేదా సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా పొందాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## రూ.పది నాణెలతో బైక్ కొనుగోలు

### బైక్ కోసం లక్షా పదివేల మొత్తం చెల్లింపు

### నాణాలు చెల్లించడంపై సోషల్ మీడియాలో వైరల్

**నల్లగొండ, జూలై 8 :** కొంత మంది తాము చేసే పని వినూత్నంగా ఉండాలని భావిస్తారు. అలా చేయడంతో వారి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. తాజాగా బైక్ కొనుగోలు చేయడానికి ఎంచుకున్న మార్గంతో ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండే రఘుపతి బైక్ కొనుగోలు చేశారు. అందుకు అవసరమైన రూ.1.10 లక్షల మొత్తాన్ని రూ.10 నాణెల రూపంలో చెల్లించారు. ఈ బైక్ కొనడం కోసం చాలా కాలంగా ఆయన రూ.10 నాణెళిలను పొదుపు చేస్తూ వచ్చారు. అలా దాచిన నగదును అంతా కవర్లలో నింపుకుని బైక్ షోరూమ్‌కు వెళ్లారు. ఈ నగదు చెల్లించి తనకు ఇష్టమైన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఆయన కొనుగోలు చేశారు. షోరూమ్‌లోని సిబ్బంది అంతా కలిసి ఈ నగదును లెక్కించారు. నగదు లెక్కించడానికి కొన్ని గంటల సమయం పట్టింది. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు స్పందించారు. కొండే రఘుపతి పొదుపుతోపాటు పట్టుదలను వారు అభినందించారు. నగదు లెక్కించిన షోరూమ్ సిబ్బందికి సెల్యూట్ చేశారు నెటిజన్లు.



## బినామీల పేరిట ఆస్తులు అనుభవించిన డీఎస్పీ భీంరెడ్డి

### ఏసీబీ రిమాండ్ రిపోర్ట్

**హైదరాబాద్, జూలై 8 :** ఏసీబీకి చిక్కిన డీఎస్పీ భీమ్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన నుంచి రెండు మెమరీ కార్డులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.300 కోట్లపైన ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఉంటున్న విల్లా ఎలా కొన్నారనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదని ఏసీబీ అధికారులు తెలిపారు. మెమరీ కార్డులు, డైరీల ద్వారా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. మెమరీ కార్డులోని వివరాల ఆధారంగా ఆస్తుల డాక్యుమెంట్లు సీజ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. 'నాకు ఇవ్వాల్సిన వాళ్లు, నేను ఇవ్వాల్సినవి' అంటూ డీఎస్పీ భీమ్‌రెడ్డి తన డైరీలో రాసుకున్నాడని ఏసీబీ అధికారులు తెలిపారు. బినామీలు ఎప్పుడైనా తిరగబడే ప్రమాదం ఉందని ఆయన ముందే ఊహించాడని అన్నారు. అక్రమాస్తులు కూడపెట్టడంలో భీమ్‌రెడ్డి చాలా తెలివిగా వ్యవహరించాడని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆస్తులను బినామీ పేర్ల మీద రిజిస్ట్రేన్ చేయించారని అన్నారు. బినామీల దగ్గర నుంచి క్యాన్సిలేషన్ డీడ్‌లను ముందే రాయించుకున్నాడని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## యూట్యూబ్ చూసి వైన్ తయారీ

- స్వయం ఉపాధికి వృద్ధుడి అక్రమ మార్గం
- ఏడాదిగా ఇంట్లోనే వైన్ తయారీతో ధనార్జన
- దాడిచేసి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు



**హైదరాబాద్, జూలై 8 :** ఇంట్లోనే అక్రమంగా వైన్ తాయరు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూట్యూబ్ వేదికగా వైన్ తయారీ నేర్చుకుని, ఇంట్లోనే అక్రమంగా వైన్ తయారు చేస్తున్న ఓ వృద్ధుడి గుట్టును మల్కాజ్‌గిరి డీటీఎఫ్ పోలీసులు రట్టు చేశారు. వృద్ధాప్యంలో స్వయం ఉపాధి మార్గం అన్వేషించే క్రమంలో ఈ అక్రమ దందాకు తెరలేపిన ఆంటోనీ పీటర్ అనే వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి డీటీఎఫ్ సీఐ భరత్ కుమార్, ఎస్సై శ్రీనివాసరెడ్డి, సిబ్బంది కలిసి ఉమ్మడిగా ఈ దాడులు నిర్వహించారు. నిందితుడు ఆంటోనీ పీటర్ గత ఏడాది కాలంగా ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఏడు రకాల ఫ్లేవర్లలో వైన్ తయారు చేస్తూ, 750 ఎంఎల్ బాటిల్‌ను రూ. 300 చొప్పున విక్రయిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నట్లు డీటీఎఫ్ సీఐ వెల్లడించారు. గ్రేప్స్ (ద్రాక్ష), పైనాపిల్, జామ, మోసంబి, సపోటా, బనానాలతో పాటు ఆఖరికి తమలపాకు ఫ్లేవర్‌తో కూడా ఇతడు వైన్ తయారు చేస్తుండటం గమనార్హం. వివిధ రకాల పండ్లను దాదాపు 15 రోజుల పాటు సహజ సిద్ధంగా ఫార్మెంటింగ్ (పులియబెట్టడం) చేసి.. ఆ రసంలో పంచదార, గోధుమలు కలిపి వడకట్టి వైన్‌గా మారుస్తున్నాడు. పండ్లను 15 రోజుల పాటు పులియబెట్టడం వల్ల ఆ రసంతో పాటు సహజంగానే అందులో ఆల్కహాల్ శాతం కూడా వస్తుందని అధికారులు తెలిపారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్ పరీక్షలు లేకుండా తయారు చేసిన వైన్‌ను నిందితుడు నేరేడ్‌మెట్, సికింద్రాబాద్, కాప్రా పరిసర ప్రాంతాల్లోని కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ఆకస్మిక దాడిలో అధికారులు నిందితుడి వద్ద నుంచి సుమారు 377.7 లీటర్ల వైన్‌ను, దాన్ని ప్యాక్ చేయడానికి సిద్ధంగా ఉంచిన 502 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ అక్రమ వైన్ నిల్వల విలువ మార్కెట్లో సుమారు రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఎక్సైజ్ శాఖ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ఈ వైన్ తయారీ వ్యవహారాన్ని చాకచక్యంగా ఛేదించిన డీటీఎఫ్ బృందాన్ని మల్కాజ్‌గిరి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ప్రణవి, ఈఎస్ బి. హన్మంతరావు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వైన్ నిల్వలతో పాటు నిందితుడు ఆంటోనీ పీటర్‌ను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాప్రా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.



## తెలంగాణ సంపన్న రాష్ట్రం అంటూ ప్రపంచ బ్యాంక్ నివేదిక

- రాష్ట్రం వస్తే ఏమొచ్చిందన్న వారికిదే సమాధానం
- ఎక్స్ వేదికగా కేటీఆర్ హర్షం

**హైదరాబాద్, జూలై 8 :** తెలంగాణ ఎగువ మధ్యాదాయ స్థాయిని దాటిన సంపన్న రాష్ట్రమంటూ ప్రపంచబ్యాంకు నివేదికను వెల్లడించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం గర్వకారణమన్నారు. తెలంగాణ విఫల రాష్ట్రం కాలేదని.. సఫల సంపన్న రాష్ట్రమై సగర్వంగా నిలిచిందని పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రజలు గర్వించే సందర్భం ఇది! సాధించుకున్న స్వరాష్ట్రం సంపన్న రాష్ట్రంగా అవతరించింది! తెలంగాణ రాష్ట్రం అప్పర్ మిడిల్ ఇన్‌కం బెంచ్ మార్క్‌ను దాటి ఎదిగిందని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది! దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం మనకు గర్వకారణం అన్నారు. తమ చెమటను.. నైపుణ్యాన్ని.. మేధస్సును రంగరించి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ శుభాభివందనాలు! తెలంగాణ వస్తే ఏమొచ్చింది? జాతి సంపద పెరిగింది.. జనం ఆదాయం అద్భుతంగా పెరిగింది! కేసీఆర్ దార్శనిక పాలనలో ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా అభివృద్ధి చెందిందని జాతీయ నివేదికలే కాదు.. అంతర్జాతీయ సంస్థలు తేల్చిచెబుతున్నాయి..! దివాలా రాష్ట్రం అని దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు ప్రపంచ బ్యాంకు తాజా నివేదికే సమాధానం..!' అని ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.



## ప్రతి ఒక్కరూ ఓటు వివరాలు నమోదు చేయాలి

### శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు

**నిజామాబాద్,జూలై8 :** బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తన స్వగ్రామమైన వేల్పూర్‌లో తహసీల్దార్ సమక్షంలో బూత్ లెవల్ అధికారులకు తన వ్యక్తిగత ఓటరు వివరాలను ఆయన స్వయంగా అందజేశారు. ఒక ఫారాన్ని అధికారులకు సమర్పించి, రసీదుగా మరో ఫారాన్ని తన వద్ద ఉంచుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్బంగా అధికారులకు, బీఎల్‌వో, బీఎల్ఏలకు కీలక సూచనలు చేశారు. బీఎల్‌ఓలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గుడులు , సంఘం భవనాల్లో ఒకే దగ్గర కూర్చుని వివరాలు రాయడం సరికాదన్నారు. ఇంటింటికీ స్వయంగా వెళ్లి ఓటర్లను కలిసి వివరాలు సేకరించాలని తెలిపారు. బీఎల్‌ఓలు ఒకే దగ్గర కూర్చుని పనిచేస్తే ప్రజల ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని, ఈ విషయంలో బాధ్యతాయుతం గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి, ఓటర్లను ప్రత్యక్షంగా చూసి వివరాలు సేకరించిన తర్వాతే ఆఫీసులో ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ తహసీల్దార్ అనిరుద్ , సర్పంచ్ అశోక్, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కథ కంచికి చేరేదెలా?



**కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నదితప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు.**

ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పదని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్ధంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్ధిని చాటుకోవాలి.

కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు.

నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకు న్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహా రాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.

# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

**ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు**

**అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు**

**బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు**



**టెహ్రాన్, జులై 8 :** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టార్గెట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు. ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

# ఇప్పుడు అయోధ్య.. గతంలో వారణాసి

**దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు**

**హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు**

**వారణాసి, జులై 8 :** ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి.



అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.



# మహారాష్ట్రలో ఎడతెరిపిలేని వర్షాలు

**పూణెలో కుప్పకూలిన మూడంతస్థుల భవనం**

**ముంబై, జూలై 8 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించారు.

# ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసింది : ట్రంప్



**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ముగిసిందని పేర్కొన్నారు. నాటో కూటమి శిఖరాగ్ర సమావేశం కోసం ట్రంప్ తుర్కియేలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇరాన్-అమెరికా చర్చల గురించి ప్రస్తావించారు. "నా దృష్టిలో అంతా ముగిసిపోయింది. వారితో నేను ఇక డీల్ చేయను. నేను మన ప్రతినిధులతో మాట్లాడాను. వారు చర్చలు జరపాలని అనుకుంటున్నారు. మనవాళ్లు మంచివాళ్లు. కానీ వారు చివరకు నా దగ్గరకు వచ్చే మాట్లాడాలి కదా. నా విషయానికి వస్తే.. ఈ చర్చలతో సమయం వృథా" అని పేర్కొన్నారు. అలాగే గతరాత్రి ఇరాన్ లోని ప్రమాదకర వ్యక్తులపై తాము శక్తిమంతమైన దాడులు చేశామని వెల్లడించారు. "మేం అంత్యక్రియలు చేసుకోండని చెప్తే.. వారు నౌకలపై దాడులు చేశారు. అందుకే మేం బలంగా ఢీకొట్టాం" అని అమెరికా దాడులు చేసిన విషయాన్ని మీడియా వద్ద ప్రస్తావించారు. ఇన్ని వ్యాఖ్యలు చేసినా.. చివరకు చర్చలకు అనుమతిస్తానని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తోన్న మూడు నౌకలపై ఇరాన్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. అందుకు ప్రతిగా ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. ఇలా పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం ముగించేందుకు ఇటీవల అవగాహన ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. దీంతో కీలకమైన హర్మూజ్‌లో చమురు రవాణా తిరిగి ప్రారంభమైంది. కానీ మధ్య మధ్య ఉద్రిక్తతలు చెలరేగుతూనే ఉన్నాయి. కొన్నిరోజుల క్రితం చమురుతో వెళుతున్న ఓ ఖరీదైన వాణిజ్య నౌకపై ఇరాన్ బలగాలు దాడి చేశాయి. దీంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ధిక్కరించినందుకు అమెరికా ప్రతీకార దాడులు చేపట్టింది. ఆ దేశ క్షిపణులు, డ్రోన్ల నిల్వ కేంద్రాలపై యుద్ధవిమానాలతో విరుచుకుపడింది. ఇరాన్ సైతం గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడి చేసింది. దాంతో మళ్లీ యుద్ధం మొదలైందని ప్రపంచం ఆందోళన చెందుతుండగా.. దాడులు ఆపాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నాయి. మళ్లీ తాజాగా అదేతరహాలో ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి.

# ట్రూడో ఆరోపణలు తేలిపోయాయి..

**నిజ్జర్ హత్యలో భారత అధికారుల ప్రమేయం లేదన్న కెనడా**

**కెనడా, జూలై 8 :** భారత్-కెనడా దౌత్యసంబంధాల్లో ఒడుదొడుకులకు దారితీసిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసులో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో భారత అధికారుల ప్రమేయం ఉన్నట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని కెనడా పోలీసులు తాజాగా ప్రకటించారు. దీంతో నాటి కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలు తప్పుగా తేలాయి. మరోవైపు, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి సహచరుడు గోల్డీబ్రార్‌పై అమెరికాలో కేసు నమోదైంది. నిజ్జర్‌ను హత్యచేయాలని వారి నుంచి ఆదేశాలు అందాయని అమెరికా దర్యాప్తు అధికారులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. యూఎస్‌కు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అంతర్జాతీయస్థాయిలో 'ఆపరేషన్ హార్డ్‌బాల్'ను చేపట్టింది. దానిలో భాగంగా అమెరికా, కెనడా, ఐరోపా వ్యాప్తంగా బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన 24 మంది మంది అనుమానితులు అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలోనే బిష్ణోయ్, గోల్డీబ్రార్ అభియోగాలు నమోదయ్యాయి. భారత్‌లోని జైలు నుంచే నిజ్జర్ హత్యకు బిష్ణోయ్ కుట్ర చేశాడని, అతడి ఆదేశాలను ఉత్తర అమెరికాలో బ్రార్ సమన్వయం చేశాడని ఆ అభియోగాల్లో అమెరికన్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఇందుకోసం స్మగ్లింగ్ చేసిన ఫోన్లు వాడారని ఆరోపించారు. నిజ్జర్ ఫొటో, చిరునామాను బిష్ణోయ్ పంపాడని వెల్లడించారు. గోల్డీపై 50,000 డాలర్ల రివార్డును కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే భారత అధికారుల ప్రమేయం లేదని కెనడా నుంచి స్పష్టత వచ్చింది.

# అప్పుడు ఆలయం వద్దని.. ఇప్పుడు రాజకీయాలు

**కాంగ్రెస్‌పై కంగన ఫైర్**



**న్యూఢిల్లీ :** అయోధ్య విరాళాల్లో దుర్వినియోగానికి పాల్పడిన వారిని భాజపా, ఆరెస్సెస్‌లు కలిసి కాపాడుతున్నాయని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను భాజపా ఎంపీ కంగనా రనౌత్ తిప్పి కొట్టారు. ఎన్నో ఏళ్లుగా అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని వ్యతికేంచిన పార్టీ.. ఇప్పుడు అదే అంశంతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి గురించి దేశప్రజలందరికీ తెలుసన్నారు. శతాబ్దాల తరబడి సాగిన పోరాటం..భక్తి ఫలితంగానే రామమందిర నిర్మాణం సాధ్యమైందని కంగన పేర్కొన్నారు. సనాతన సంస్కృతి, విశ్వాసం, దేశ వారసత్వాన్ని పరిరక్షించడానికి భాజపా ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. తమ పార్టీ ప్రజల విశ్వాసాన్ని ఓటు బ్యాంకు రాజకీయాలకు సాధనంగా వాడుకోలేదన్నారు. అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ స్వప్రయోజనాల కోసం మతాలను సాధనంగా వాడుకుంటోందని విమర్శించారు. రామమందిరం వంటి పవిత్రమైన అంశాన్ని రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు.



## విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి : ఏఐఎస్ఎఫ్

**శేరిలింగంపల్లి, జులై 8(జనం వార్త):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ సమితి నాయకుడు టి. నితీష్ ధర్మతేజ విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జూలై 10న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ లేకపోవడం, విద్యార్థులపై ఫీజుల భారం పెరగడం, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వంటి సమస్యలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించి ప్రజాస్వామ్య, లౌకిక, శాస్త్రీయ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 10న జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు, ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని టి. నితీష్ ధర్మతేజ పిలుపునిచ్చారు.



## వ్యవసాయ రంగంలో సేవలకు సయ్యద్ షఫీకి డాక్టరేట్

**కూకట్ పల్లి, జులై 8, ( జనం వార్త ) :** బయో ఫెర్టిలైజర్స్, ఆర్గానిక్ పెస్టిసైడ్స్ ఉత్పత్తులతో గత 15 సంవత్సరాలుగా వ్యవసాయ రంగంలో నిరంతర సేవలందిస్తూ, రైతుల అభివృద్ధికి అంకితభావంతో చేస్తున్న సేవలకు కూకట్ పల్లి కి చెందిన సయ్యద్ షఫీ యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాండిచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ న్యూజెర్సీ నిర్వాహకులు సయ్యద్ షఫీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. హో సయ్యద్ షఫీ నాణ్యమైన ఉత్పత్తులు, సాంకేతిక సలహాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందించడం ద్వారా వేలాది మంది రైతుల విశ్వాసాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సయ్యద్ షఫీ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ షఫీ మాట్లాడుతూ డాక్టరేట్ రావడం చాలా సంతోషంగా ఉందని, తనకు బాధ్యత మరింత పెరిగిందన్నారు.



## మల్లాపూర్‌లో బాక్స్ డ్రైన్ పనులకు శంకుస్థాపన

**ఉప్పల్ :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ టౌన్‌షిప్‌లో రూ. 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జనప్రియ టౌన్‌షిప్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలు ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వ, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిని ప్రాధాన్యంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనప్రియ టౌన్‌షిప్ కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సింగన్నగూడలో ఘనంగా వైయస్సార్ 77వ జయంతి వేడుకలు

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా 'జననేత' : గోదా అరుణ్ యాదవ్

**ములుగు :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 77వ జయంతి వేడుకలను సింగన్నగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దుర్గం మధు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రియతమ నాయకుడికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొక్కొండ గ్రామం 1వ వార్డు సభ్యుడు గోదా అరుణ్ యాదవ్ హాజరయ్యారు. ఆయన వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నర్సగౌడ్, రాజు, శ్రీనివాస్, రాములు, కిరణ్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైయస్సార్ ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు పునరుద్ఘాటించారు.

## మంత్రి దామోదర్‌తో జోగిపేట చేనేత సంఘం నూతన పాలకవర్గం భేటీ

### మంత్రిని సన్మానించిన నూతన పాలకవర్గం

### పాలకవర్గానికి పలు సూచనలు చేసిన మంత్రి



**కూకట్‌పల్లి, జూలై 8, (జనం వార్త) :** జోగిపేట చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి నూతన పాలకవర్గ సభ్యులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. చేనేత కార్మికులు, వారి కుటుంబాల అభ్యున్నతికి కృషి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. సంఘంలో అందరికీ న్యాయం జరిగే విధంగా పాలన సాగించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందని స్పష్టం చేశారు. కార్మికులందరితో త్వరలోనే సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకోవాలని, అందరి సలహాలు తీసుకున్న అనంతరం ముందడుగు వేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**శేరిలింగంపల్లి, జులై 8(జనం వార్త):** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకులకు సూచించారు. బుధవారం శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్, చందానగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు సుప్రజా ప్రవీణ్ కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీకి వెన్నెముకలాంటివారని, ఐక్యతతో పనిచేస్తే బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. పార్టీ కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. బలమైన సంస్థాగత నిర్మాణం.. ఐక్య నాయకత్వం.. ప్రజలే లక్ష్యంగా ముందుకు సాగే బీఆర్ఎస్ అనే సంకల్పంతో పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి, పి. శ్రీకాంత్, సుబ్బారాజు, ఎర్రబెల్లి సతీష్ రావు, గోపురాజు శ్రీనివాస్ రావు, అల్లావుద్దీన్ పటేల్, రామకృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్‌లో వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు

### వై.ఎస్.ఆర్ ప్రజల కోసం జీవించిన నాయకుడు : జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి,జులై 8(జనం వార్త) :** అధికారంలో ఉన్నంతకాలం ప్రజల కోసం జీవించారు, అధికారాన్ని విడిచినా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిన నాయకుడు వై.ఎస్.ఆర్ అని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్ కొనియాడారు. బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్‌లో సురేష్ నాయక్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్,ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎం.రఘునాథ్ యాదవ్,టీఆర్‌సీఓఆర్ చైర్మన్ బెల్లయ్య నాయక్, శేరిలింగంపల్లి కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరం,అన్నదాన కార్యక్రమం, కేక్ కటింగ్, ఉచిత మందుల పంపిణీ చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమాజ సేవే లక్ష్యంగా ఆరోగ్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు,ఉచిత మందుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ తన సోదరుడు సురేష్ నాయక్ సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళున్న నాగేశ్‌ను నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి : ఎమ్మార్వో

### ఆలయ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ

**నాగారం, జూలై 08 (జనంవార్త) :** విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదువుకోవాలని కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి, నాగారం, ఎస్.సి కాలనీ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో శ్రీ భవాని నాగలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుమారు రెండువేల నోట్ బుక్స్ లను పంపిణీ చేయడం అభినందనియమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వర్ రావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.






## కాలనీ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎలక్ట్రికల్ ఏఈకి వినతి



**ఉప్పల్ :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె. సుధాకర్ ఆధ్వర్యంలో చర్లపల్లి--2 ఎలక్ట్రికల్ ఏఈ బాలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో ప్రస్తుతం ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్‌ను త్రీ ఫేజ్‌గా మార్చడంతో పాటు, జాయింట్లు ఉన్న పాత విద్యుత్ లైన్ల స్థానంలో కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఏఈ బాలరాజు మాట్లాడుతూ, కాలనీలోని విద్యుత్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, కొత్త వైరింగ్ లైన్లు, విద్యుత్ స్తంభాల మార్పిడి కోసం అంచనాలు సిద్ధం చేసి, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



## యాప్ ద్వారానే ఎరువులను కొనుగోలు చేయాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి
- ఎరువుల దుకాణాన్ని తనిఖీ
- ఆన్ లైన్ బుకింగ్ యాప్ పని తీరు పరిశీలన

**మేడ్చల్ :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఆన్ లైన్ యాప్ ద్వారానే ప్రతి రైతు ఎరువులను కొనుగోలు చేసేందుకు చేపట్టిన ప్రక్రియను శామీర్ పేట్ లోని షేక్ చాంద్ ఎరువుల దుకాణంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ యాప్ పని తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆన్ లైన్ ద్వారా ఏవిధంగా ఎరువులు బుక్ చేసుకోవాలనే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రైతు కూడా ఈ యాప్ ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి రైతు కూడా ఎరువుల కోసం తప్పనిసరి ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో ఈ యాప్ ద్వారా 3,598 ఎరువుల బుకింగ్ జరిగాయని అందుకు గాను 753 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు పొందారని కూడా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనాథ్, మండలంలోని ఎరువుల డీలర్స్, రైతులు పాల్గొన్నారు.



## రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా ఏ గోపాల్ రావు

**కూకట్ పల్లి :** రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గం కు చెందిన ఏ గోపాల్ రావు రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు దక్కుతాయని పేర్కొన్నారు. అలాగే అందరినీ కలుపుకొని బిజెపి పార్టీనీ బలోపేతం చేసి రానున్న గ్రేటర్ ఎన్నికలలో బిజెపి పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ తనకు పదవిని కట్టబెట్టినందుకు బిజెపి బలోపేతానికి శాశ్వతుల కృషి చేస్తానని పేర్కొన్నారు.




## దశదిన సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్

**కారేపల్లి :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని అప్పయ్యగూడెం గ్రామపంచాయతీ బిక్య తండాకు చెందిన మండల నాయకుడు అజ్మీర్ వీరన్న తల్లి అజ్మీర్ ఈరి దశదిన సంస్మరణ కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్య రాములు నాయక్ హాజరై అజ్మీర్ ఈరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, ఉన్నం వీరేందర్, నాయకురాలు పగడాల మంజుల, వైరా నియోజకవర్గ నాయకులు భూక్య వీరభద్రం, లాల్ సింగ్, సైదులు, బానోత్ రామూర్తి, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, పలువురు సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొని అజ్మీర్ ఈరికి ఘనంగా నివాళులర్పించారు.




## ఉప్పల్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

### ఆక్రమణలు తొలగింపు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు

**ఉప్పల్ :** ట్రాఫిక్ రద్దీని నియంత్రించి ప్రజలకు సురక్షితమైన, సాఫీ రాకపోకలు కల్పించేందుకు ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ కె. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక అమలు కార్యక్రమం నిర్వహించారు. రాధికా ఎక్స్‌రోడ్స్ నుంచి ఏఎస్‌రావు నగర్ మీదుగా కనరా జంక్షన్ వరకు చేపట్టిన ఈ తనిఖీల్లో ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించిన నిర్మాణాలు, వ్యాపారాలను తొలగించారు. అలాగే నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపిన వారిపై, అక్రమ పార్కింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్--41తో పాటు సెక్షన్--39(బి) కింద కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కె. సంపత్ కుమార్ ఫుట్‌పాత్ వ్యాపారులు, వాణిజ్య సంస్థల యజమానులతో మాట్లాడి ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించవద్దని, ప్రధాన రహదారులపై అక్రమ పార్కింగ్‌కు అవకాశం కల్పించవద్దని సూచించారు. తమ సంస్థలకు వచ్చే వినియోగదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌పై ఇకపై నిరంతరం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డెల్టా--1, డెల్టా--2 సిబ్బందితో పాటు ట్రాఫిక్ ఎస్ఐలు, ఇతర ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

## హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో లోకేశ్ సమావేశం

## కుప్పంలో ఫుట్‌వేట్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమకు ఓకే

**అమరావతి, జూలై 8 :** దక్షిణ కొరియా బుసాన్‌లో హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీలో హ్యోసంగ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం పలికారు. కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ , మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు. ఏపీలో నెక్ట్స్‌జెన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కుప్పం కేంద్రంగా దక్షిణ భారత సమగ్ర ఫుట్‌వేర్ తయారీ క్లస్టర్‌కు ప్రతిపాదన చేశారు. తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏపీలో టైర్-1, టైర్-2 వెండర్లతో సప్లయర్ మీట్ నిర్వహించాలని హ్యోసంగ్‌కు ఆహ్వానం పలికారు. కుప్పంలో రూ.900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్ - లెదర్ ఫుట్‌వేర్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హ్యోసంగ్ ప్రతినిధులు తెలిపారు. ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యంగా హ్యోసంగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని ప్రతినిధులు వివరించారు. అడిడాస్ సహా గ్లోబల్ బ్రాండ్లకు క్షఇఓ సరఫరాదారుగా హ్యోసంగ్ ఉండనుందని వెల్లడించారు. తొలి దశలో ఎగుమతులు.. ఆపై దేశీయ మార్కెట్‌పై దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హ్యోసంగ్ ప్రతినిధులు తెలిపారు. అలాగే బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి లోకేశ్ సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో బూట్ల తయారీ పక్రియను పరిశీలించారు. మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, స్మార్ట్ చిప్‌లతో తయారయ్యే షూస్‌పై ఆసక్తి కనపరించారు. పాదాల ఆరోగ్యానికి ప్రత్యేక వైబ్రేషన్ చిప్ టెక్నాలజీని లోకేశ్ పరిశీలించారు. రక్తప్రసరణ మెరుగుదల, కండరాల అలసట తగ్గించే స్మార్ట్ ఫుట్‌వేర్ తయారీ గురించి ఆయన తెలుసుకున్నారు. 'పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో , ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ,ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో బుసాన్‌లో సమావేశ మయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. సింగిల్ విండో విధానంలో అనుమతులతో పాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని వివరించాను' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# తప్పుడు కూతలు కూసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

## జోసెఫ్ రావణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ విజయసాయి

**అమరావతి, జూలై 8 :** జోసెఫ్ రావణ్ వ్యవహారంపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు మద్దతు ఎవరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిద్దరు ఏ సంస్కృతికి వారసులు? అని నిలదీశారు. వారి తండ్రులు, తాతలు ఎవరు మూలాలు ఎక్కడ? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తప్పుగా మాట్లాడినవారికి చట్టం, సమాజం బుద్ధి చెప్పాలని విజయసాయి రెడ్డి హెచ్చరించారు. అలాంటివారికి యావజ్జీవం లేదా ఉరిశిక్ష వేసినా తప్పులేదని విజయసాయి రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. అభ్యంతర వ్యాఖ్యలతో దాడి చేయడం ఫ్యాషన్ అయిపోయిందని విమర్శించారు. మతం మారిన కొన్ని కులాల్లోని కుటుంబాలు.. హిందుత్వంపై విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌ను వైసీపీ సమర్థించడ మంటే.. దేశంపై చేస్తున్న దాడిగానే పరిగణించాలని అన్నారు. దేశద్రోహ కుట్రలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజయసాయి రెడ్డి సూచించారు.

# ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

## రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్

**విజయవాడ, జూలై 8 :** రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని.. ఎస్సీలను పావులుగా వాడుకుని రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరినైనా ఏది పడితే అది మాట్లాడొచ్చని అనుకుంటున్నారని.. హిందూ దేవతలను తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడిన తర్వాత అరెస్టు చేస్తే హక్కుల ఉల్లంఘన అంటున్నారన్నారు. సినిమా తారలు, యూట్యూబర్స్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వీరిపై ఎందుకు దేశద్రోహం కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీలను వాడుకుంటున్నారని ఆరోపించారు. విదేశీ శక్తులు కూడా కుట్రలో పాలు పంచుకుంటున్నాయన్నారు. విద్రోహ కార్యకలాపాలు చేసే వాళ్లు అందరూ ఇక్కడకు చేరుకుంటున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును ఉద్దేశించి పలువురు సభలు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో పెద్ద నాటకం జరుగు తోందని మాధవ్ అన్నారు. జోసెఫ్ తన పేరును రావణ్ అని మార్చుకున్నారని తెలిపారు. హిందువులపై విషం కక్కుతున్నారని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులను రాష్ట్రంలో తిరగనివ్వకూడదని మాధవ్ పేర్కొన్నారు.

# జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు

**విజయవాడ, జూలై 8 :** జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు అందింది. జడా శ్రవణ్ కుమార్ ఆదాయపన్ను ఎగవేశారంటూ కారంపూడి జానకి సుమంత్ ఐటీ శాఖకు ఫిర్యాదు చేశారు. జడా శ్రవణ్ కుమార్‌పై బినామీ ఆస్తుల చట్టంతో పాటు ఆదాయపన్ను చట్టం కింద క్రిమినల్ చర్యలు చేపట్టాలని సుమంత్ తన ఫిర్యాదులో కోరారు. కాగా, మత విద్వేషాలు, వైషమ్యాలు రగిలిస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అందిన ఫిర్యాదు మేరకు కొద్దిరోజుల క్రితం జై భీమ్ భారత్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్‌తోపాటు మరికొందరిపై ఏలూరు త్రీ టౌన్, కాళ్ల పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను వ్యక్తిగతంగా దూషించి హేళన చేశారని ఏలూరు గొల్లాయిగూడానికి చెందిన పెద్దాడ వెంకటరమణ, కాళ్ల మండలం సీసలికి చెందిన తోట ఫణిబాబు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు, పాలకోడేరు పోలీసు స్టేషన్లలోనూ శ్రవణ్ కుమార్‌పై ఫిర్యాదులందాయి.

# మత్స్యకార కుటుంబాలకు భరోసా

- పది లక్షల చొప్పున పరిహారం అందించిన మంత్రి కొల్లు
- గల్లంతయిన వారి జాడ తెలియక కుటుంబాల్లో విషాదం



**విశాఖపట్నం, జూలై 8 :** విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది. బుధవారం మృతుల కుటుంబాలకు మంత్రి కొల్లు రవీంద్ర చెక్కులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఐదు లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఐదు లక్షలను అందజేశారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు మత్స్యకారుల కుటుంబాలకు అందించి నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా మత్స్యకారులకు ఇవ్వాల్సిన 63 క్లెయిమ్స్ పెండింగ్‌లో పెట్టారన్నారు. రూ.3.15 కోట్లను కూడా ఈరోజు క్లియర్ చేశామన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన డిపార్ట్‌మెంట్‌లతో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని మంత్రి కొల్లురవీంద్ర పేర్కొన్నారు. మరోవైపు మంత్రి రాకను మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా నిరసించాయి. తమవారిని రక్షించకుండా ఎందుకు వచ్చారని నిలదీశారు. ఇకపోతే సముద్ర జలాల్లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. చేపలరేవులోని బోటు ఆపరేటర్ల సంఘం కార్యాలయంలో తమ వారి రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూనే ఉన్నారు. బోటు యజమాని కారి చిన్న సురక్షితంగా బయటకు వచ్చి తన కళ్ల ఎదుటే సహచరులు మునిగిపోయారని చెప్పడంతో వారిలో ఆందోళన మరింత తీవ్రమైంది. ఇంటి పెద్దల జాడ తెలియకపోవడంతో పిల్లలతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నారు. కొందరు కడసారి చూపులకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ వచ్చిన సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని.. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని.. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని వారంతా కోరారు. చేపల రేవుకు పది నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదంలో చిక్కుకున్న సమాచారాన్ని వారి కుటుంబసభ్యులు ఈ నెల 4న సాయంత్రం 4 గంటల సమయంలో మత్స్యకార సంఘాల నేతలకు తెలియజేసినప్పటికీ ఆ విషయం మత్స్య శాఖ అధికారుల దృష్టికి రాత్రి 10.10 గంటల వరకు వెళ్లలేదు. ఈలోపు నష్టం జరిగిపోయింది. మత్స్యకా రులు సమాచారమివ్వగానే అధికారులకు తెలియజేసి ఉంటే సెర్చింగ్ ఆపరేషన్ అదే రోజు సాయంత్రం ప్రారంభమయ్యేది. రాత్రి 9 గంటల వరకు బోల్తా పడిన బోటుపై సాయం కోసం మత్స్యకారులు ఎదురు చూశారు. పడవ మునిగిపోతుండటంతో సముద్ర జలాల్లో ఈత కొడుతూ ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. తమకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి వస్తున్నామని సమాచారం వచ్చిందని.. 4 గంటల సమయంలో ప్రమాదంలో చిక్కుకున్నారని భావించి మత్స్యకార సంఘాల నాయకులకు తెలియజేసినట్లు మత్స్యకార మహిళలు చెప్పిన విషయాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మత్స్య శాఖ డీడీకి విషయం తెలియగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో కోస్టుగార్డును అప్రమత్తం చేశారు. నౌకలు కాకినాడలో ఉండటంతో ఆదివారం ఉదయం నుంచి గాలింపు చర్యలు మొదలయ్యాయి. మత్స్యకారులు సమాచారం ఇచ్చిన వెంటనే అధికారులకు తెలియజేస్తే మెరుగైన ఫలితాలు ఉండేవని.. సమాచార లోపంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం

- హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- వారికి జగన్ వత్తాసు పలకడం మరీ దారుణం
- మండిపడ్డ మంత్రులు ఆనం, సత్యకుమార్ యాదవ్





**అమరావతి, జూలై 8 :** భారతీయులు, హిందువుల మనోభవాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని జగన్ సమర్థించడం, చిచ్చు పెట్టేలా చేయడం దారుణమని ఎపి మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఇలాంటి నీచానికి దిగజారుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారిని గొడ్డలి పార్టీ సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభవాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా? అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు. రాజ్యాంగం ఇవ్వని భావ ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. రాజకీయంగా సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ది పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ విద్వేషాలు రేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకుపడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# బద్రీనాథ్ విరాళాల అవకతవకలు



## ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం

**దేహ్రాదూన్:** బద్రీనాథ్ ఆలయానికి వచ్చిన విరాళాల నిర్వహణలో జరిగిన అవకతవకలపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సీఎం పుష్కర్ సింగ్ ధామి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆలయ విరాళాల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరిచేం దుకు.. ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకురావాల్సిన సంస్కరణలను బద్రీనాథ్ కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీకి విచారణ అనంతరం సూచించాలని ప్రభుత్వం ఆదేశించింది. బీకేటీసీ ఉత్తరాఖండ్‌లో బద్రీనాథ్‌తో పాటు మరో 44 ఆలయాలు, పలు పాఠశాలలు, ధర్మశాలల ను నిర్వహిస్తోంది. ఆలయ విరాళాలను ఎవరు చోరీ చేశారనే విషయం తెలుసుకోవడానికి ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు ఆలయానికి వచ్చిన విరాళాల రికార్డులు, నగదు నిర్వహణ, విరాళాల సేకరణ, లెక్కింపునకు సంబంధించిన విధానాలు, ఇతర పత్రాలను సమీక్షిస్తున్నామన్నారు. ఆలయ కమిటీలోని వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరోవైపు విరాళాల నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే బీకేటీసీ అంతర్గత విచారణకు ఆదేశించింది. అక్రమాలకు పాల్పడినట్టు ప్రాథమిక సాక్ష్యాధా రాలు లభించడంతో ప్రమోద్ నౌట్యాల్ అనే ఉద్యోగిని సస్పెండ్ చేశామని బీకేటీసీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది తెలిపారు.

# నిరంజన్ మృతి వార్తతో ఖిన్నుడైన పవన్ కల్యాణ్

## ఎక్స్ వేదికగా సంతాపం

**అమరావతి, జూలై 8 :** హనుమకొండకు చెందిన తన అభిమాని నిరంజన్ మృతిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది' అంటూ పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. అలాగే నిరంజన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ తీరని విషాదాన్ని భరించే శక్తిని వారికి ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించానని అన్నారు. కాగా, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ కోరిక మేరకు గత నెల 17న పవన్ కల్యాణ్ హనుమకొండలోని అతని ఇంటికి వెళ్లి పరామర్శించిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం అర్ధరాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిరంజన్ తుదిశ్వాస విడిచాడు. ఈ విషాద ఘటనపై పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. చిన్నారితో గడిపిన క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు.

# ఇండోనేషియాలో ప్రధాని నోట కుచ్ కుచ్ హోతా హై

## కృతజ్ఞతలు తెలిపిన దర్శకుడు కరణ్ జోహార్

**ముంబై, జూలై 8 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటనలో చేసిన కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జకార్తాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మోదీ.. బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం 'కుచ్ కుచ్ హోతా హై' లోని టైటిల్ సాంగ్‌ను ప్రస్తావిస్తూ భారత్-ఇండోనేషియా సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆ చిత్ర దర్శకుడు కరణ్ జోహార్ ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఇండోనేషియాలో భారతీయ సంస్కృతికి మంచి ఆదరణ ఉందని పేర్కొన్న ప్రధాని మోదీ.. అక్కడ 'కుచ్ కుచ్ హోతా హై' పాట ఎంతో ప్రాచుర్యం పొందిందని చెప్పారు. ఇండోనేషియాలో భారతదేశానికి చెందిన 'కుచ్ కుచ్ హోతా హై' పాట చాలా ప్రాచుర్యం పొందింది. భారత్, ఇండోనేషియా కలిసి ముందుకు సాగినప్పుడు మన ప్రయాణం కేవలం 'కుచ్ కుచ్' దగ్గరే ఆగిపోకుండా 'బహుత్ కుచ్' సాధించే దిశగా సాగాలి' అని వ్యాఖ్యానించారు.మోదీ చేసిన ఈ చమత్కార వ్యాఖ్యలకు సభలో చప్పట్లతో స్వాగతం లభించింది. ప్రధాని మోదీ తన సినిమాను ప్రస్తావించడంపై ప్రముఖ దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. జకార్తాలో మన గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా గురించి మాట్లాడటం ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించింది. ప్రేమకు సరిహద్దులు లేవని, అది అందరికీ అర్థమయ్యే భాష అని ఈ సందర్భం మరోసారి నిరూపించింది. మా సినిమాను, ఆ పాటను గుర్తుచేసినందుకు ధన్యవాదాలు అని ఆయన పేర్కొన్నారు.

# శ్రీవారి భక్తులకు సూచన..

## ఈ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

**తిరుమల:** తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సూచన. జులై నుంచి సెప్టెంబర్ మధ్య పలు తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను తితిదే (టిటిడి) రద్దు చేసింది. వివిధ పర్వదినాలు, ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకుంది. భక్తులు దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమల యాత్రకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. ఈ మేరకు తితిదే ఓ ప్రకటన విడుదల చేసింది. ఆయా తేదీలకు ముందురోజు తిరుమలలో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తెలిపింది.

**వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దయిన తేదీలు, కారణాలివే..**

జులై 14- కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
జులై 17- ఆణివార ఆస్థానం
జులై 19- శ్రీ ఆండవన్ ఆశ్రమ స్వామీజీకి పెద్ద మర్యాద
జులై 29- జీయర్ స్వాముల చాతుర్మాస సంకల్పం
ఆగస్ట్ 22- పవిత్రోత్సవాలకు అంకురార్పణ
ఆగస్ట్ 24- పవిత్రోత్సవాల రెండోరోజు సందర్భంగా పవిత్రాల సమర్పణ
సెప్టెంబర్ 8- శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం
సెప్టెంబర్ 14- శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

# దిగొచ్చిన బంగారం ధర..

## రూ.6వేలు తగ్గిన వెండి



దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా దిగొచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ ప్రకటన నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం తర్వాత ఈ లోహాల ధరల్లో ఒక్కసారిగా దిద్దుబాటు చోటుచేసుకుంది. దీంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,46,730 పలికింది. ఈ ఉదయంతో పోలిస్తే దీని ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.28లక్షలకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే వెండి ధర దాదాపు రూ.6వేల మేర దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4049 డాలర్లు పలికింది. ఈ ఉదయం దీని ధర దాదాపు 4200 డాలర్లు పలకగా.. ట్రంప్ ప్రకటన తర్వాత ఒక్కసారిగా పడిపోయింది. ఔన్సు వెండి ధర 58.40 డాలర్లుగా ట్రేడ్ అవుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీల్లోనూ ఈ లోహాల ధరలు పతనమయ్యాయి. గోల్డ్ ఆగస్టు ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ 10 గ్రాముల ధర 1.5శాతం పడిపోయి రూ.1.43లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి సెప్టెంబరు ఫ్యూచర్స్ కేజీ ధర 3.17శాతం మేర తగ్గి రూ.2.23లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ ముగిసిందని ప్రకటించారు. దీంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అటు దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా భారీగా పతనమయ్యాయి. రూపాయి విలువ మరింత క్షీణించింది. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు కూడా పడిపోవడం గమనార్హం.






# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

### ఏకంగా 1,677.12 పాయింట్లు పతనం

### దాదాపు 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి

**పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో వ్యక్తమైన ఆందోళనల సెగ బుధవారం నాటి ట్రేడింగ్‌లో భారత సూచీలను భారీ నష్టాల్లోకి నెట్టింది. ఉదయం నుంచి ఒడిదుడుకులతో సాగిన మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి గురై మరింతగా కుప్పకూలాయి.**

**ముంబై, జూలై 8 :** మార్కెట్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1,677.12 పాయింట్లు పతనమై 76,503.60 వద్ద స్థిరపడింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ-50 సైతం 516.65 పాయింట్లు నష్టపోయి 23,882.05 వద్ద ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 77,816.45 పాయింట్ల వద్ద, నిఫ్టీ 24,259.55 పాయింట్ల వద్ద లాభనష్టాల మధ్య సాధారణంగానే ప్రారంభమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 77,851.18 వద్ద, నిఫ్టీ 24,300.00 వద్ద ఈరోజు గరిష్ఠాలను తాకాయి. అయితే మధ్యాహ్నం 1:00 గంట దాటిన తర్వాత పశ్చిమాసియా నుంచి వచ్చిన ప్రతికూల వార్తలతో మార్కెట్లు నిలువునా కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఒకానొక దశలో 76,259.03 పాయింట్ల కనిష్టానికి, నిఫ్టీ 23,805.20 పాయింట్ల కనిష్టానికి పడిపోయి ఇన్వెస్టర్లలో వణుకు పుట్టించాయి. అమెరికా-ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడం ప్రపంచవ్యాప్త మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయాలతో చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇది భారత్ లాంటి దిగుమతుల పై ఆధారపడే దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమైంది. మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడంతో విదేశీ, స్వదేశీ ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోకుండా షేర్లను విక్రయించి నగదును సురక్షితమైన బంగారం వైపు మళ్లించేందుకు మొగ్గు చూపారు. బుధవారం ముగిసిన ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్, మెటల్, రియల్ ఎస్టేట్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మార్కెట్లు ఒకే రోజు ఈ స్థాయిలో పతనం కావడంతో ఇన్వెస్టర్ల దాదాపు 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద కరిగిపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ 2శాతం పైగా పడిపోవడంతో రూ. 8.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లి ఇండియా విక్స్ 25 పెరిగిపోయింది. ఒకే సెషన్‌లో పెట్టుబడి దారుల సంపద సుమారు రూ. 8.40 లక్షల కోట్లు క్షీణించింది. గత సెషన్ లోని రూ. 480.20 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్, ఈ సెషన్‌లో రూ. 471.80 లక్షల కోట్లకు పడిపోయింది. ఫలితంగా సెషన్ సమయంలో అస్థిరత తీవ్రంగా పెరిగింది. ఇండియా విక్స్ 24.86 శాతం పెరిగి 14.54కు చేరింది. ఇది పెట్టుబడిదారులలో పెరిగిన ఆందోళనను సూచిస్తోంది. ఇవాళ మార్కెట్ అంతటా కూడా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఎన్ఎస్ఈలో 2,525 స్టాక్‌లు క్షీణించగా, 694 పురోగమించాయి. 86 స్టాక్‌లు యథాతథంగా ఉన్నాయి. దీంతో, అన్ని ప్రధాన రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 2.72 శాతం, నిఫ్టీ కెమికల్స్ 2.67 శాతం, నిఫ్టీ సిమెంట్ 2.57 శాతం, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ 2.52 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.51 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 2.49 శాతం, నిఫ్టీ సర్వీసెస్ 2.45 శాతం, నిఫ్టీ మీడియా 2.31 శాతం, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఆయిల్ / గ్యాస్ ఒక్కొక్కటి 2.23 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ స్టాక్‌లలో, ఇండిగో 5 శాతం పడిపోయింది. దాని తర్వాత మారుతి సుజుకి, హిందుస్థాన్ యూనిలివర్, బజాజ్ ÷నాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా / మహీంద్రా, ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ / టూబ్రో, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతి ఎయిర్‌టెల్ ఉన్నాయి. అయితే, సెన్సెక్స్‌లో ట్రెంట్ అతి తక్కువగా ప్రభావితమైన స్టాక్‌గా నిలవడం విశేషం. ఇది 0.20 శాతం స్వల్పంగా తగ్గింది.



## అక్కడ చిన్న బౌండరీలు.. బ్యాటింగ్‌కు అనుకూలం: జోఫ్రా ఆర్చర్

ఇంగ్లాండ్ పిచ్‌లతో పోలిస్తే భారత్‌లో ఐపీఎల్ కోసం వినియోగించిన పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటాయని స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వ్యాఖ్యానించాడు. మూడో టీ20లో టీమ్‌ఇండియాపై ఇంగ్లాండ్ 125 పరుగుల తేడాతో గెలవడంలో ఆర్చర్‌దే కీలక పాత్ర. మూడు కీలకమైన వికెట్లను పడగొట్టాడు. ఐపీఎల్‌లో తన సహచరుడైన వైభవ్ సూర్యవంశీని ఆర్చరే పెవిలియన్‌కు చేర్చాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. "ఐపీఎల్‌లో చాలా మంది భారత ఆటగాళ్లను ఎదుర్కొన్నా. అయితే, ఇంగ్లాండ్ పిచ్‌లపై బౌలింగ్ కోసం నా ప్రణాళికల్లో మార్పులు చేసుకున్నా. అక్కడన్నీ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. చిన్న బౌండరీలు. కానీ, ఇంగ్లాండ్‌లో పరిస్థితులు భిన్నం. ఇక్కడికి వచ్చాక నార్మల్ స్థితికి వచ్చా. ఎందుకంటే ఐపీఎల్‌లో మంచి లెంగ్త్‌తో స్ట్రెయిట్‌గా వేసినా భారీ షాట్లను కొడతారు. అదే ఇక్కడైతే బ్యాటర్లు పొరపాట్లు చేయడానికిగల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అక్కడ ఒక్కోసారి 200ం కూడా సురక్షితమైన స్కోరు కాదు. ఇలా అనకూడదు కానీ ఆత్మవిశ్వాసంతో బౌలింగ్ చేయలేకపోయేవాళ్లం. ఇక్కడ మాత్రం అది గొప్ప స్కోరే అవుతుంది. దానిని సవాల్ చేయొచ్చు. మూడో టీ20లో వికెట్లు తీసిన మిగతా సహచరులకు కృతజ్ఞతలు. బౌలింగ్‌లో సమష్టిగా రాణించాం" అని జోఫ్రా వెల్లడించాడు. "ఇప్పుడు నేను కూడా సూర్యవంశీతో సమంగా స్కోరు చేశా. అయితే, ఇప్పుడు కథ ముగియలేదు. ఇంకా రెండు టీ20లు ఉన్నాయి. ఫలితం ఎలా ఉంటుందో తెలియదు. అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించినవారిదే విజయం అవుతుంది" అని జోఫ్రా ఆర్చర్ తెలిపాడు. వైభవ్, ఆర్చర్ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు సభ్యులే.



## సంజు శాంసన్ ఫామ్ కోల్పోయాడు

### అందుకే వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకున్నాం

### టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడి

202 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌట్ కావడంతో, టీ20 ప్రపంచకప్ 2026 హీరో సంజు శాంసన్‌ను ప్లేయింగ్ ఎలెవన్ నుండి పక్కన పెట్టడంపై పెద్ద ఎత్తున ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఈ వివాదాస్పద నిర్ణయంపై గంభీర్ స్పందిస్తూ.. జట్టు ఎంపిక విషయంలో తనకు, సంజు శాంసన్‌కు మధ్య పూర్తి స్పష్టత ఉందని, అయితే ఆ అంతర్గత సంభాషణను తాను బహిర్గతం చేయలేనని స్పష్టం చేశారు. టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించిన శాంసన్, ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో వరుసగా 5, 0, 1 పరుగులకే పరిమితమై ఫామ్ కోల్పోయాడు. అతని స్థానంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకున్నారు. మొదటి విషయం ఏంటంటే, సంజు శాంసన్‌కు జట్టులో తన పాత్ర గురించి ఎలాంటి స్పష్టత కావాలో, అది నా వైపు నుండి అతనికి ఇప్పటికే అందించబడింది. ఇది పూర్తిగా ఒక ఆటగాడికి, హెడ్ కోచ్‌కు మధ్య జరిగిన వ్యక్తిగత సంభాషణ, ఇది బయటకి రాదు. సంజు విషయంలో మాకు పూర్తి క్లారిటీ ఉంది. భారత్ తరఫున అతను చేసిన ప్రదర్శన అసాధారణమైనది. కానీ, కొన్నిసార్లు ఒక నిర్దిష్ట ఆటగాడి ప్రస్తుత ఫామ్‌ను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అతడు ఈ సిరీస్‌లో మళ్లీ ఆడే అవకాశాలు కూడా ఉన్నాయి' అని గంభీర్ స్పష్టం చేశాడు. టీమ్ కాంబినేషన్, ప్రస్తుత ఫామ్, ఫలితాల ఆధారంగానే ఈ మార్పులు చేయాల్సి వచ్చిందని గంభీర్ సమర్థించుకున్నారు. శాంసన్‌కు టీ20 ప్లాన్స్‌లో తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెబుతూనే, ప్రస్తుతానికి ఫామ్‌కు ప్రాధాన్యత ఇవ్వక తప్పలేదని కోచ్ తేల్చి చెప్పారు.

# టీమిండియా పేస్ బౌలర్ల వైఫల్యం



టీమిండియా పేస్ బౌలర్ల వైఫల్యం వెనుక ప్రధాన కారణం స్ట్రాటజీ లోపమే. బౌలర్లందరూ కేవలం వికెట్ల కోసం ఎటాకింగ్ లెంగ్త్‌లోనే బౌలింగ్ చేస్తుండటంతో, పరుగులను కట్టడి చేసి ప్రెజర్ పెంచే 'యాంకర్' రోల్ కరువైంది. ఇదే విషయాన్ని ఓ మాజీ దిగ్గజం తీవ్రంగా తప్పుబట్టారు.క్రీజులో ఉన్న బ్యాటర్‌ను కట్టడి చేసి, ప్రెజర్ పెంచడం బౌలింగ్ బేసిక్ రూల్. కానీ ప్రస్తుత టీమిండియా పేసర్ల మైండ్‌సెట్ పూర్తిగా మారిపోయినట్లు కనిపిస్తోంది. చేతికి బంతి రాగానే వికెట్ తీసేయాలన్న కక్కుర్తే వారి కొంపముంచుతోంది. న్యూస్18 తాజా కథనం ప్రకారం, భారత బౌలర్ల తీరుపై ఓ మాజీ క్రికెట్ దిగ్గజం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అందరూ ఎటాక్ చేయడానికే చూస్తే పరుగులను ఆపేది ఎవరు?' అన్న ఆయన ప్రశ్న ఇప్పుడు క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒక బౌలింగ్ యూనిట్ సక్సెస్ కావాలంటే అందులో వేరియేషన్స్ ఉండాలి. ఒకప్పుడు జహీర్ ఖాన్ లాంటి బౌలర్లు ఒక ఎండ్‌లో వికెట్ల కోసం ఎటాక్ చేస్తుంటే, మునాఫ్ పటేల్ లాంటి వారు మరో ఎండ్‌లో పరుగులను కట్టడి చేసేవారు. ఒకరు కట్టడి చేస్తేనే, మరొకరికి వికెట్లు దక్కుతాయి. కానీ ప్రస్తుత భారత పేస్ దళంలో ప్రతి ఒక్కరూ 'స్ట్రైక్ బౌలర్' అవ్వాలనే ఆరాటపడుతున్నారు. కొత్త స్పీడ్ గన్ అశోక్ శర్మ లాంటి కుర్రాళ్లపై వస్తున్న అంచనాలు గమనిస్తే, కేవలం పేస్ మాత్రమే ముఖ్యమన్నట్లుగా వాతావరణం మారిపోయింది. లైన్ అండ్ లెంగ్త్ గాలికి వదిలేసి, బౌన్సర్లు, యార్కర్ల పేరుతో ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నారు. తెరవెనుక జరుగుతున్న ఈ పరిణామాలను ఇండియా హెరాల్డ్ పాఠకుల కోసం డీకోడ్ చేస్తోంది. అసలు ఈ 'ఎటాకింగ్ ప్లాన్' ఎవరిది? కెప్టెన్‌దా? బౌలింగ్ కోచ్‌దా? లేక బౌలర్లు తమ సొంత నిర్ణయాలతో చెలరేగుతున్నారా? ప్రతి బంతికి వికెట్ తీయాలనే ప్రెజర్ బౌలర్లపై స్పష్టంగా కనిపిస్తోంది. డాట్ బాల్స్ వేసి బ్యాటర్‌ను విసిగించే సహనం ప్రస్తుత పేసర్లలో కరువైంది. మేనేజ్‌మెంట్ వైపు నుంచి బౌలర్లకు స్పష్టమైన రోల్స్ ఇవ్వకపోవడమే ఈ గందరగోళానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. వికెట్లు తీయడం మ్యాచ్‌లు గెలిపిస్తుంది నిజమే.. కానీ పరుగులు ఇవ్వకుండా కట్టడి చేయడం టోర్నమెంట్లు గెలిపిస్తుంది. టీమిండియా మేనేజ్‌మెంట్ తమ బౌలర్లకు స్పష్టమైన రోల్స్ కేటాయించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎటాక్, డిఫెన్స్ మధ్య సరైన బ్యాలెన్స్ లేకపోతే రాబోయే మెగా టోర్నీల్లోనూ టీమిండియాకు భంగపాటు తప్పదు. బౌలింగ్ వ్యూహాల్లో మార్పులు జరుగుతాయా, లేక మళ్లీ పాత తప్పులనే రిపీట్ చేస్తారా అన్నది వేచి చూడాలి.

# టీజీ20 లీగ్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన నాలుగు జట్లు




టీజీ20 లీగ్‌లో ప్లేఆఫ్స్ సమరం ఆసక్తికరంగా మారింది. లీగ్ దశ చివరి రోజు జరిగిన మ్యాచ్‌లతో సెమీఫైనల్ బెర్తులపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఇప్పటికే హైదరాబాద్ ఈ ఛాంపియన్స్, ఖమ్మం ఏసెస్ నాకౌట్ దశకు అర్హత సాధించగా, మంగళవారం జరిగిన మ్యాచ్‌ల అనంతరం కరీంనగర్ డైమండ్స్, రంగారెడ్డి రైజర్స్ కూడా చివరి రెండు స్థానాలను దక్కించుకున్నాయి. ఏడు మ్యాచ్‌ల్లోనూ విజయాలు నమోదు చేసిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ 14 పాయింట్లతో అజేయంగా లీగ్ దశను ముగించింది. ఖమ్మం ఏసెస్ 10 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మిగిలిన రెండు బెర్తుల కోసం కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ జట్ల మధ్య పోటీ నెలకొనగా, మెరుగైన రన్‌రేట్ కరీంనగర్, రంగారెడ్డికి కలిసి వచ్చింది. ఎనిమిది పాయింట్లు సాధించిన నల్గొండ రన్‌రేట్‌లో వెనుకబడటంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే భారీ విజయం తప్పనిసరి పరిస్థితిలో బరిలోకి దిగింది రంగారెడ్డి రైజర్స్?. వరంగల్ వారియర్స్‌పై ఏకపక్ష విజయం నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 252 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆరోన్ జార్జ్ 91 పరుగులతో అదిలే ఇన్నింగ్స్? ఇచ్చాడు. ఆ తర్వాత ఆదిత్య 77 పరుగులు, వెంకట కార్తీక్ 51 పరుగులతో కీలక సహకారం అందించారు. భారీ లక్ష్య ఛేదనలో వరంగల్ బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. 12.3 ఓవర్లలోనే 91 పరుగులకు ఆలౌటై 161 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూశారు. నితిన్, హితేశ్? తలో మూడు వికెట్లు తీసి రంగారెడ్డి విజయాన్ని ఖాయం చేశారు.మరో కీలక మ్యాచ్‌లో కరీంనగర్ డైమండ్స్ సమష్టి ప్రదర్శనతో పాలమూరు స్ట్రైకర్స్‌పై 73 పరుగుల తేడాతో గెలిచింది. టాప్-4లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. టాస్? ఓడి మొదట బ్యాటింగ్?కు దిగిన కరీంనగర్ డైమండ్స్? నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ అద్భుత శతకంతో చెలరేగి 58 బంతుల్లో 109 పరుగులు సాధించాడు. సాత్విక్ రెడ్డి, నారాయణ తేజ కూడా సహకారం అందించారు. 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాలమూరు ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. దినేశ్, శుభమ్ శర్మ చెరో మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా సంహిత్ రెడ్డి మాత్రం చివరి వరకు పోరాడు. అజేయంగా 67 పరుగులు సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో పాలమూరు భారీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. కరీంనగర్ బౌలింగ్‌లో రత్లావత్ దినేశ్, శుభం శర్మ చెరో మూడు వికెట్లు, నారాయణ తేజ, అశిష్ శ్రీవాస్తవ్ తలో వికెట్? తీసి పాలమూరు బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. నిర్ణీత ఓవర్లలో పాలమూరు 9 వికెట్లకు 143 పరుగులకే పరిమితమైంది.లీగ్ దశలో అద్భుత ఫామ్ కనబరిచిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ టైటిల్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఖమ్మం ఏసెస్, కరీంనగర్ డైమండ్స్, రంగారెడ్డి రైజర్స్ కూడా సమతూక ప్రదర్శనతో నాకౌట్ దశకు చేరుకోవడంతో ప్లేఆఫ్స్‌లో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉప్పల్? వేదికగా ఎలిమినేటర్ మ్యాచ్? జరగనుంది. గురువారం మధ్యాహ్నం 2:15 గంటలకు కరీంనగర్ డైమండ్స్?, రంగారెడ్డి రైజర్స్? తమ సత్తాను తేల్చుకోనున్నాయి. అదే రోజు సాయంత్రం 7:15 గంటలకు హైదరాబాద్ ఈ ఛాంపియన్స్?, ఖమ్మం ఏసెస్ క్యాలిఫయర్-1 మ్యాచ్ ?ఆడనున్నాయి.

# టాప్ 10 నుంచి సూర్యకుమార్ ఔట్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ విడుదల చేసింది. లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ టాప్‌లోనే కొనసాగుతుండగా, మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (687 రేటింగ్స్) టాప్ 10 నుంచి ఔట్ అయ్యాడు. అతడు తాజా ర్యాంకింగ్స్‌లో 5 స్థానాలు కోల్పోయి 13వ ర్యాంక్‌కు దిగజారాడు. ఇక ప్రస్తుతం భారత్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జాకప్ బెతెల్ ఏకంగా ఏడు స్థానాలు మెరుగుపర్చుకొని టాప్ 10లోకి ఎంటర్ అయ్యాడు. ప్రస్తుతం అతడు ఎనిమిదో ప్లేస్‌లో ఉన్నాడు. అయితే ఈ ఏడాది మార్చిలో జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత సూర్య టీ20 మ్యాచ్ ల్లో బరిలోకి దిగలేదు. దీంతో ర్యాంక్ పడిపోవడం సహజమే! ఏప్రిల్, మే నెలల్లో ఐపీఎల్ ఆడాడు. అయితే అందులో విఫలం కావడంతో సూర్య టీమ్‌ఇండియాలో చోటు కోల్పోయా డు. అతడిని గత నెలలో జరిగిన ఐర్లాండ్ పర్యటన, ప్రస్తుతం ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. అలాగే ఇదే నెలలో జింబాబ్వేతో ఆడనున్న సిరీస్‌కు కూడా సూర్య ఎంపిక కాలేదు. దీంతో ముమ్ముందు సూర్య ర్యాంక్ మరింత పడిపోయే ఛాన్స్ ఉంటుంది!




# జులై 15 నాటికి ఈపీఎఫ్ వడ్డీ జమ

**న్యూఢిల్లీ :** ఈపీఎఫ్ చందాదారులకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక వడ్డీని మరో వారం రోజుల్లో జమ చేయనున్నట్లు వెల్లడించింది. జులై 15 నాటికి దాదాపు 34 కోట్ల ఈపీఎఫ్ ఖాతాల్లో రూ.1.44లక్షల కోట్ల వడ్డీ సొమ్ము జమ కానున్నట్లు తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 8.25శాతం వడ్డీని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వడ్డీ జమకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఫీల్డ్ వెరిఫికేషన్ జరుగుతోందని సంబంధిత అధికారులు వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో పూర్తయిన తర్వాత.. వారంలోగా చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ కానుంది. గతంలో ఈపీఎఫ్ నిధుల వార్షిక వడ్డీని ప్రకటించిన కొన్ని నెలల తర్వాత సెప్టెంబరు-అక్టోబరులో చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ అయ్యేది. అయితే, ఈసారి ఆటోమేటెడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ప్రాసెసింగ్ సమయం తగ్గిందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. దీంతో పాటు చందాదారుల కోసం ఒకే 'యునిఫైడ్ మెంబర్ పోర్టల్'ను తీసుకొస్తున్నట్లు ఈపీఎఫ్ఓ ప్రకటించింది. ఇకపై చందాదారులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయిన తర్వాత.. తమ పీఎఫ్ బ్యాలెన్స్‌లు, క్లెయిమ్‌ల స్టేటస్‌లతో పాటు ఇతర సేవలను ఒకే చోట పొందొచ్చు. గతంలో ఇందుకోసం వేర్వేరు పోర్టల్స్ ఉండేవి. ఇక, ఆటోమెటెడ్ క్లెయిమ్ పరిమితిని కూడా ఈపీఎఫ్ఓ రూ.లక్ష నుంచి రూ.5లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే.



## ఎమోషనల్ రొమాంటిక్ డ్రామా..
# హృదయ మురళి

కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' . ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్–సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా కనిపించడం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.




## టాక్సిక్ నుంచి తబాహీ
# వీడియో సాంగ్ విడుదల




యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఆగస్టు 26న విడుదల కానుండడంతో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. ఈ చిత్రంలో యశ్‌కు జోడీగా ఐదుగురు హీరోయి–న్‌లు నటించిన విషయం తెలిసిందే. వీరిలో నదియా పాత్రలో కియారా అద్వాణీ కనిపించనున్నారు. యశ్ – కియారా మధ్య వచ్చే 'తబాహీ' వీడియో సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. గతంలో ఈ పాట పోస్టర్‌తో చిత్రబృందం ఆడియో విడుదల చేసింది. కొన్ని రోజులకే పాట, పోస్టర్‌పై విమర్శలు వచ్చాయి. కియారా కూడా ఈ పాటలోని బోల్డ్ సీన్స్ తగ్గించాలని రిక్వెస్ట్ చేశారంటూ వార్తలు వచ్చాయి. వీటిని ఆమె కొట్టిపారేసినప్పటికీ పాట మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఈ పాట పూర్తి వీడియోను టీమ్ పంచుకుంది. ఇప్పటి వరకూ 'టాక్సిక్' నుంచి వచ్చిన అన్ని వీడియోల్లాగే ఇందులోనూ శృంగార సన్నివేశాలు ఉండడం మరోసారి చర్చకు దారితీస్తోంది. ఇక భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రంలో హై–ఇంపాక్ట్ యాక్షన్ అవతార్‌లో యశ్ కనిపించనుండగా.. మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ పాత్రల్లో అందాల భామలు నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ ఆకట్టుకుంటున్నారు.



## బాలీవుడ్ ఎంట్రీ ఉందంటున్న నందిని రెడ్డి

సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' మంచి వసూళ్లు రాబట్టింది. దీంతో దర్శకురాలు నందినికి బాలీవుడ్ నుంచి అవకాశాలు వస్తున్నాయి. త్వరలో తాను బాలీవుడ్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉందని ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. రెండేళ్లు దిల్లీలో చదువుకున్నా. అప్పుడు చాలా హిందీ సినిమాలు చూసేదాన్ని. మంచి కథ కుదిరితే హిందీలో సినిమా చేస్తా. ఏ భాషలో చెప్పినా అది కథే కదా. త్వరలో ఒక డార్క్ సూపర్ నేచురల్ వెబ్‌సిరీస్ తీయబోతున్నా. అక్టోబర్‌లో షూటింగ్ మొదలుపెడతా. లైట్ హార్టెడ్ సినిమాల తర్వాత ఓటీటీలో కాస్త భిన్నంగా ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. తన తదుపరి ఫిల్మ్ 2027 ప్రారంభంలో ఉంటుందని వెల్లడించారు.

## రాకాను వదులుకున్న
# ప్రీతి ముకుందన్

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని ప్రీతి ముకుందన్ వదులుకున్నట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై అట్లీ స్పందించారు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. నేను ప్రీతి నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. అప్పటికే ఆమె బిజీగా ఉండటంతో మాకు డేట్స్ కేటాయించలేక పోయింది. దీంతో ఈ ప్రాజెక్టును ఆమె వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రీతి రిజెక్ట్ చేసిన ఈ కీలక పాత్రను మలయాళ నటి ఫెమినా జార్జ్‌కు ఆఫర్ చేసినట్లు అట్లీ స్పష్టం చేశారు. ఆ పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. 'కన్నప్ప'తో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రీతి ముకుందన్ ఇటీవల 'బ్లాస్ట్'తో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు తమిళ రొమాంటిక్ కామెడీ 'హృదయం మురళి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. జులై 10న విడుదల కానుంది.

## పెద్ద ప్రాజెక్టులలో నిధి అగర్వాల్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఈ మధ్య కాలంలో అదృష్టం కలిసి రావడం లేదు. పెద్ద పెద్ద ప్రాజెక్టులలో నటించే అవకాశాలు వచ్చినప్పటికీ, ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాయి. స్టార్ హీరోల సరసన స్క్రీన్ షేర్ చేసుకున్నప్పటికీ, ఈ అందాల భామకు సరైన హిట్ మాత్రం పడటం లేదు. ఇటీవల ఆమె ఎంతో ప్రతిష్టాత్మకంగా నటించిన 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' వంటి భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలను అందుకోలేకపోయాయి. ఎంతో కష్టపడినప్పటికీ అదృష్టం కలిసిరాకపోవడంతో హిట్ అందుకోలేకపోయారు. అయినప్పటికీ అమ్మడు ఏమాత్రం నిరాశ చెందకుండా. ముందుకు సాగుతున్నారు. అయితే వరుస ఫ్లాపులు పడుతున్నా నిధి అగర్వాల్ క్రేజ్ ఏమాత్రం తగ్గడం. నిర్మాతలు, దర్శకులు ఇప్పటికీ ఆమెకు క్రేజీ ఆఫర్లు ఇస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో నిధి అగర్వాల్ ప్రస్తుతం ఏకకాలంలో నాలుగు భారీ చిత్రాలు చేస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. జూలై 8న ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నిధి స్వామివారి వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



# అప్పుడు మహేశ్‌బాబు స్టార్‌డమ్ గురించి తెలియదు
## హీరోయిన్ కృతిసనన్ సంచలన విషయాలు వెల్లడి



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ ' నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో? అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అభిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.

## నవీన్ పోలిశెట్టి సినిమాకు తమిళ దర్శకుడు



ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో నవీన్ పొలిశెట్టి. ఇది ఆయన కెరీర్‌లో రూ.100కోట్ల వసూళ్లు సాధించిన తొలి సినిమాగా పేరు తెచ్చుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఆయనతో ఓ సినిమా చేయబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం ఓ తమిళ దర్శకుడితో చేతులు కలుపుతున్నట్లు తెలిసింది. 'సైరన్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆంటోని భాగ్యరాజ్‌తో తను కలిసి పని చేయనున్నట్లు సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com